# ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరు సహకరించాలి

**- జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్**



కామారెడ్డి బ్యూరో మార్చ్16 (వాయిస్ టుడే): భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సాధారణ పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్ కోరారు .శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధు శర్మ లతో కలిసి జిల్లాలో సాధారణ ఎన్నికల నిర్వహణపై ప్రెస్ మీట్ నిర్వహించారు.జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ, భారత ఎన్నికల కమిషన్ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేసిందని, ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వస్తుందని, ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 25 తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, ఏప్రిల్ 26 వరకు నామినేషన్ల స్క్రూటినీ, ఏప్రిల్ 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందని, మే 13న పోలింగ్, జూన్ 4 న కౌంటింగ్ నిర్వహణ జరుగుతుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ జాబితాలో తమ పేరు సరి చూసుకోవాలని, జాబితాలో పేరు లేని వారు ఏప్రిల్ 15 వరకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన మేర పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఓటర్ కు రెండు కిలోమీటర్ల రేడియస్ లో పోలింగ్ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకున్నామని, అవసరమైన మేర బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఎన్నికల కమిషన్ సాధారణ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుండి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి వర్తిస్తుందని అన్నారు.

మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచే విధంగా వ్యాఖ్యలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, బెదిరింపులకు పాల్పడటం, తప్పుడు ప్రచారాలు చేయడంపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు, నాయకులకు సమావేశాలు నిర్వహించు కునేందుకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు అందిస్తామని, ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఉంటుందని, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీలులేదని అన్నారు.

రాజకీయ సమావేశాలు ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాలల్లో, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో నిర్వహించరాదని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎం.సి.సి., సర్వేలెన్స్ బృందాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను, వీడియో సర్వేలెన్సు బృందాలను, ఎం.సీ.ఎం.సీ కమిటీ, ఇతర కమిటీలను ఏర్పాటు చేశామని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ఫిర్యాదులను ప్రజలు 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా, సి-విజిల్ యాప్ ద్వారా చేయవచ్చని అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్లో ఫిర్యాదుల స్వీకరించేందుకు 24 గంటల కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, సి -విజల్ యాప్ లో లైవ్ వీడియో అప్ లోడ్ చేసిన 100 నిమిషాల గడువులోపు అధికారులు క్షేత్రస్థాయిలో చేరుకొని ఫిర్యాదు పై చర్యలు తీసుకుంటారని అన్నారు.రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు,ఫోటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో 24 గంటల వ్యవధిలో, బస్ స్టాండ్, రైల్వే స్టేషన్ పెట్రోల్ బంక్ మొదలైన పబ్లిక్ ప్లేస్ లలో 48 గంటల వ్యవధిలో, అనుమతి లేని ప్రైవేట్ స్థలాలలో 72 గంటల వ్యవధిలో పూర్తి స్థాయిలో తొలగిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న - ఎస్పీ సింధు శర్మ మాట్లాడుతూ,భారత ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం తెలంగాణలో నాలుగో విడతలో పోలింగ్ జరుగుతుందని తెలిపారు. అక్రమ నగదు, లిక్కర్ సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో అవసరమైన మేర 5 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, 24 గంటలపాటు గట్టి నిఘా ఉంచామని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎన్నికల దృష్ట్యా ప్రజలు ఆధారాలు లేకుండా 50 వేలకు మించి నగదు తో ప్రయాణించవద్దని, ప్రతిరోజు తనిఖీలలో జప్తు చేసిన సొమ్మును జిల్లా లో ఏర్పాటు చేసే గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తామని, ఆధారాలు సమర్పించి గ్రీవెన్స్ కమిటీ నగదు విడుదల చేస్తుందని తెలిపారు.



## తప్పుడు పత్రాలు సృష్టించి 60 కోట్లు భూమిని కాజేసిన నిందితుల అరెస్టు

చేవెళ్ల, మార్చి16(వాయిస్ టుడే)తప్పుడు పత్రాలు సృష్టించి స్థలాన్ని కాజేసేందుకు యత్నించిన వ్యక్తులను అరెస్టు చేసిన ఘటన శంకరపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శంకరపల్లి గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 334,335 లోని 5 ఎకరాల 12 గంటల భూమిని ముళ్ళపూడి వీర వెంకట సత్యనారాయణ రావు అతని మిత్రులు 2005లో భూమిని కొనుగోలు చేశారు . కాగా మచిలీపట్నం, విజయవాడ, కాకినాడ ప్రాంతాలకు చెందిన కొందరు వ్యక్తులు ఇట్టి భూమిని కాజేసేందుకు నకిలీ పత్రాలు సృష్టించి వెంకట సత్యనారాయణ మృతి చెందినట్లు పత్రాలు సృష్టించి, అతని వారసుడు వరప్రసాద్ పేరుపై నకిలీ ఆధార్ కార్డుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అతని నుంచి ఇతరులకు అమ్మినట్లుగా రిజిస్ట్రేషన్ చేయడంతో బాధితులు వీర వెంకట సత్యనారాయణ శంకర్ పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి అక్రమ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్న దేవగానుగుల రామవీర వెంకట వరప్రసాద్, పార్థసారథి, పోతునురి, త్రినాథ్ విజయ భార్గవన్ అను నలుగురిని అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించారు.



## ప్రమాదానికి కారణమైన బాధ్యులను కఠినంగా శిక్షించాలి

### ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు వాసి రెడ్డి సీతారామయ్య

రామకృష్ణాపూర్ మార్చి 16 (వాయిస్ టుడే) యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా కాసిపేట 2వ గనిలో జనరల్ మజ్దూర్ గా విధులు నిర్వహిస్తున్న కర్రె రాజు(36) అనే కార్మికుడు మృతి చెందినట్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు.శనివారం రామకృష్ణాపూర్ ఏరియా హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మరణించిన రాజు కుటుంబాన్ని అయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందమర్రి ఏరియా స్టోర్ లో సపోర్ట్ రేకులు లోడ్ చేస్తున్న క్రమంలో రూప్ బెల్ట్ తెగిపోవడంతో కార్మికుడి మీద పడి మృతి చెందాడని, సూపర్వైజర్ లేని కారణంగా ప్రమాదం జరిగి మృతి చెందినట్లు, దీనికి పూర్తి బాధ్యత యాజమాన్యం వహించి బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. మృతునికి భార్య ఒక కుమారుడు ఉన్నట్లు ఆ కుటుంబాన్ని యాజమాన్యం అన్ని విధాలుగా ఆదుకోవాలని మృతుని భార్యకు సర్ఫేస్ జనరల్ మజ్దూర్ గా అవకాశం ఇవ్వాలని దీనికి యాజమాన్యం అంగీకరించిందని భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా యాజమాన్యం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.



## ఇండ్ల పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి మార్చి 16 2024 (వాయిస్ టుడే) : రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో అందజేయనున్న శాశ్వత ఇండ్ల పట్టాల పంపిణీకి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముఖ్య అతిథిగా హాజరై 159 మందికి పట్టాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. అర్హులకు అందిస్తున్న ఇండ్ల పట్టాల పంపిణీకి రావడం సంతోషంగా ఉందన్నారు.

## నూతన బోర్వెల్ పనులను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి మార్చి 16 2024 (వాయిస్ టుడే) : నెన్నల గ్రామపంచాయతీ లోని బెస్తవాడలో మంచి నీటి కోసం నూతన బోర్వెల్ పనులను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. నాయకులు మాట్లాడుతూ.. వేసవికాలం సమీపిస్తున్నందున మంచి నీటి సమస్య ఎదుర్కొనేందుకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు నూతన బోరు పనులను ప్రారంభించామన్నారు.



## విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

మక్తల్ మార్చ్ 16 వాయిస్ టుడే ప్రతినిధి: లైన్స్ క్లబ్ ఆఫ్ మక్తల్ భీమా అధ్యక్షులు లైన్ బి అంబాదాస్ రావు అధ్యక్షతన మరియు లైన్ DV చారి ప్రోగ్రాం చైర్మన్ సహకారంతో నేడు శాంతినికేతన్ ఉన్నత పాఠశాల నందు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయబోయే విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన ప్యాడ్ పెన్నులు పెన్సిల్ రబ్బర్ ఎరేజర్ పౌచ్ మొదలగు వస్తువులను పంపిణీ చేయడం జరిగినది కార్యక్రమానికి ముందుగా పాఠశాల కరస్పాండెంట్ రోహిణి చారి రోహిణి చారి సరస్వతి మాతకు పూజ నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు ఇట్టి కార్యక్రమంలో రీజియన్ చైర్ పర్సన్ రమేష్ రావు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదివిన విషయాలను పరీక్షల్లో నిర్భయంగా రాయాలని అన్ని ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని మరియు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఆశిస్తున్న ఫలితాలు తీసుకురావాలని తెలియజేశారు 10వ తరగతి అత్యుత్తమ ఫలితాలు పొందిన ప్రథమ ద్వితీయ విద్యార్థులకు లైన్ అనుగొండ శ్రీనివాస్ వెండి పథకాలను అందజేస్తారని తెలియజేశారు.






## జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానంలో రక్తదాన శిబిరం

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి మార్చి 16 2024 (వాయిస్ టుడే) : బెల్లంపల్లిలోని జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం ప్రాంగణంలో లోక్ అదాలత్ ను పురస్కరించుకొని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని జూనియర్ సివిల్ జడ్జి ముఖేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. రక్తదాన శిబిరంలో సివిల్ జడ్జ్ ముఖేష్ రక్తదానం చేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా శాఖ తరపున సివిల్ జడ్జ్ ముఖేష్ ను శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు..

## ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య



అశ్వాపురం, మార్చి 16 (వాయిస్ టుడే) ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అశ్వాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన అయిలపొంగు జగదీష్ (19) ప్రేమ విఫలం కావడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరి లేని సమయంలో చీరతో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు . పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అశ్వాపురం సీఐ జి అశోక్ రెడ్డి తెలిపారు.

## వ్యక్తి ఆత్మహత్య

వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా మార్చ్ 16 నవాబు పేట్ / తన కూతురు అత్తగారింటికి కాపురానికి వెళ్లడానికి నిరాకరించడంతో తీవ్ర మనస్థాపానికి గురైన నవాబుపేట్ మండల పరిధిలోని కూచూరు గ్రామానికి చెందిన బ్యాగరి హనుమంతు ( 46 )క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అభిషేక్ రెడ్డి తెలిపారు. మూడు నెలల క్రితం భర్త శ్రీనుతో గొడవపడి వచ్చిన కూతురు సోని భర్త తన వెంట తీసుకెళ్లడానికి వచ్చినా కూడా వెళ్లకపోవడంతో హనుమంతు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన బిఆర్ఎస్ నాయకులు



రామకృష్ణాపూర్ మార్చి 16 (వాయిస్ టుడే) క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు గాంధీ నగర్ లో 4.20 లక్షల రూపాయల మున్సిపాలిటీ సాధారణ నిధుల నుండి నూతనంగా నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు కౌన్సిలర్ బొద్దుల రమ్య ప్రేమ్ సాగర్ ఆధ్వర్యంలో చెన్నూరు నియోజకవర్గ నాయకులు డాక్టర్ రాజా రమేష్, బిఆర్ఎస్ పట్టణ ఇంచార్జ్ గాండ్ల సమ్మయ్య చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేయడం జరిగింది. అనంతరం డాక్టర్ రాజా రమేష్ మాట్లాడుతూ చెన్నూరు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు బిఆర్ఎస్ ప్రభుత్వ హయాం లోనే జరిగాయని, నూతనంగా నిర్మించే సీసీ రోడ్డు పనులు బాల్క సుమన్ ఆధ్వర్యంలో నిధులు మంజూరు అయినట్లు తెలిపారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లాలో 4927 కేసులు పరిష్కారం



కామారెడ్డి బ్యూరో మార్చ్16 వాయిస్ టుడే: జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లాలో 4927 కేసులు పరిష్కరించబడినట్లు గౌరవనీయ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి మరియు ఛైర్‌పర్సన్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా తెలిపారు. అందులో 23 సివిల్ కేసులు, 4895 క్రిమినల్ కేసులు, 9 ప్రిలిటిగేషన్ కేసులు పరిష్కరించబడ్డాయి. లోక్ అదాలత్ విజయం అన్ని న్యాయవాదులు మరియు పోలీసు అధికారుల సహకారంతో జరిగింది. ఈ లోక్ అదాలత్ కోసం న్యాయశాఖ ఉద్యోగులు రాత్రింబవళ్లు కష్టపడుతున్నారు. సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శివరాత్రి ప్రతాప్ లోక్ అదాలత్ విజయవంతానికి ప్రధాన సహకారం అందించినందుకు ప్రశంసించబడ్డారు. అయ్యప్ప సేవా సమితి గ్రామాల నుండి వచ్చిన న్యాయవాదులందరికీ బియ్యం, నీరు మరియు మజ్జిగ పంపిణీ చేస్తుంది.

## అక్రమంగా గ్యాస్ సిలిండర్లు వ్యాపారులను సివిల్ సప్లైఎన్ఫోర్స్మెంట్ అధికారులు పట్టివేత



వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా మార్చ్ 16: కోయిలకొండ మండలం: గృహ అవసరాలకు వినియోగించే ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లను, వ్యాపార వినియోగానికి ఉపయోగించే కమర్షియల్ గ్యాస్ సిలిండర్లలో అక్రమంగా రిఫిలింగ్ చేసి అధిక ధరలకు అమ్ముకుంటున్న 148 గ్యాస్ సిలిండర్లను జిల్లా సివిల్ సప్లై ఎన్ఫోర్స్మెంట్ అధికారులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా సివిల్ సప్లై అధికారి కె.శ్రీనివాస్? ఆధ్వర్యంలో కోయిల్ కొండ మండలంలోని నిర్మానుష్య ప్రాంతంలో అభంగపట్నం గ్రామానికి చెందిన సి.రమేష్, సి.శ్రీహరి, సి.యాదయ్యలు గృహ వినియోగానికి వాడే 84 ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల నుండి 64 వ్యాపార సంస్థలు వినియోగించే కమర్షియల్ గ్యాస్ సిలిండర్లలోకి అక్రమంగా రిఫిలింగ్ చేసి టిఎస్ 06 యూఇ 3008 టాటా ఏస్ వాహనంలో జిల్లాలోని వివిధ హోటళు ళకు అధిక ధరలకు అక్రమంగా సరఫరా చేస్తున్నట్లు ఎన్ఫోర్స్మెంట్ అధికారులు గుర్తించారు. పట్టుకున్న 148 సిలిండర్లను, వాహనాన్ని కొయిల్ కొండ మండలంలోని రెహమాన్ ఆథరైజడ్ గ్యాస్ కంపెనీకి తరలించినట్లు అధికారులు తెలిపారు. నిందితులను కోయిల్ కొండ పోలీసులకు అప్పజెప్పినట్లు,ఈ ఆదివారం పంచనామా చేసి నిందితులపై చట్ట ప్రకారం కేసు నమోదు చేస్తామని పోలీసులు,ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో జిల్లా డిసీఎస్ఓ కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ తహశీల్దార్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి నాగరాజు,నవాబు పేట్ డిప్యూటీ తహశీల్దార్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి వరప్రసాద్,హన్వాడ డిప్యూటీ తహశీల్దార్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి ఆదిత్య గౌడ్, జడ్చర్ల డిప్యూటీ తహశీల్దార్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి లు పాల్గొన్నారు.